క్లుప్తంగా

వాడచీపురుపల్లిలో శునకాల తిష్ట



వాడచీపురుపల్లి సంతబయలులో సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో వీధి శునకాల బెడద ఎక్కువైంది. గ్రామంలో ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా వెలసిన మాంసం, చేపల దుకాణాల కారణంగా కుక్కల సంచారం ఎక్కువైంది. మాంసం వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా వస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై తిష్ట వేసి అటుగా వెళ్తున్న వాహనచోదకులపై దాడి చేస్తున్నాయి. అంతే కాకుండా రాత్రి వేళ అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీధి కుక్కల బారిన పడి వారానికి ఇద్దరు, ముగ్గురు స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న ఘటనలు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను అరికట్టడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం అవసరం



ఫార్మాసిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

పరవాడ: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాల్సిన అవసరం ఉందని ముఠా కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కె.వెంకునాయుడు డిమాండ్ చేశారు. ముఠా కార్మికుల సమస్యలపై ఫార్మాసిటీలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకునాయుడు మాట్లాడుతూ ముఠా కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ముఠా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ వంటి సౌకర్యాలను కల్పించాలని ఆయన కోరారు. సంఘ నాయకులు కర్రి పోతి నాయుడు, ఆదారి రాజు, పి.చిన్నారావు, దేముడు. కె.దొరబాబు, సత్తిబాబు, రాము, రమణ, ముత్యాలు, చిరంజీవి పాల్గొన్నారు.

'సమాజ చైతన్య దీపికలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సామాజిక అంశాలతో 'సమాజ చైతన్య దీపికలు' అనే పేరుతో పుస్తకాన్ని రాయడం అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కళావేదిక కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తురగా వెంకట నాగేశ్వరరావు రచించిన సమాజ చైతన్య దీపికలు కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అంశాలను తన కవితా సంపుటిలో రచయిత చక్కగా వివరించారన్నారు. ఇటువంటి కవితా సంపుటిలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తకాన్ని విశ్లేషించారు. ఈ సందర్భంగా రచయిత నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ మాజీ చైర్మన్ వంకాయల తాతారావు, రచయిత, కళావేదిక వ్యవస్థాపకుడు నండూరి రామకృష్ణ, లెఫ్టినెంట్ కల్నల్ ఎ.కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం నాల్గో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీ'ల్లో వైఎస్సార్‌సీపీ జోష్

- వార్డు ఉప ఎన్నికల్లో రెండూ కైవసం
- కార్యకర్తల్లో ఉత్సాహం



గొరపల్లి 4వ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన తంగేటి దేవుడమ్మ



కన్నూరు 7వ వార్డు సభ్యుడిగా ఎన్నికైన మడక అప్పారావు

సింహాచలం: ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటారు. పెందుర్తి, పరవాడ మండలాల పరిధిలో రెండు వార్డులకు ఎన్నికలు జరగగా.. వాటిలో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే గెలిచారు. దీంతో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం పుంజుకొంది. పెందుర్తి మండలం గొరపల్లి పంచాయతీ నాలుగో వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ హవా చాటింది. గొరపల్లిలో ఆది నుంచి వైఎస్సార్‌సీపీకి పట్టు ఉండటంతో విజయం ఏకపక్షమైంది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన తంగేటి దేవుడమ్మ(39) తన సమీప ప్రత్యర్థి టీడీపీ బలపరిచిన వనం చిన్నాపై 124 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ వార్డు జనరల్ కేటగిరీకి కేటాయించారు. దేవుడమ్మ భర్త తంగేటి అప్పారావు నాలుగో వార్డు మెంబరుగా గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలిచారు. గతేదాది ఆయన మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహించారు. అప్పారావు భార్య దేవుడమ్మ బరిలో నిల్చున్నారు. నాలుగో వార్డులో మొత్తం 244 మంది ఓట్లకు 174 ఓట్లు పోలయ్యాయి. ఇందులో దేవుడమ్మకు 149 ఓట్లు రాగా సమీప టీడీపీ బలపరిచిన అభ్యర్థి వనం చిన్నాకు 25 ఓట్లు మాత్రమే వచ్చాయి. దేవుడమ్మ భారీ మెజార్టీతో గెలవడంపై గ్రామంలో సందడి నెలకుంది. గొరపల్లి పంచాయతీ సర్పంచ్ గొరపల్లి శ్రీను, వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, తదితరులు.. దేవుడమ్మకు అభినందనలు తెలిపారు.

కన్నూరులో జోష్

పరవాడ: మండలంలో కన్నూరు పంచాయతీ 7వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన మడక అప్పారావు విజయం సాధించడంతో ఆ పార్టీలో జోష్ నింపింది. అప్పారావు సమీప జనసేన బలపరిచిన అభ్యర్థి శీరంశెట్టి సత్తిబాబుపై 34 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించి సత్తా చాటారు. వార్డులో 192 ఓట్లకు 158 ఓట్లు పోలయ్యాయి. వీటిలో అప్పారావుకు 96 ఓట్లు రాగా.. సత్తిబాబుకు 62 ఓట్లు పడ్డాయి. ఏడో వార్డు సభ్యుడు మదపాక అప్పలనాయుడు మృతి కారణంగా ఈ ఉప ఎన్నిక జరిగింది. సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు కృషితో వైఎస్సార్‌సీపీ సునాయాసంగా ఈ వార్డును కైవసం చేసుకుంది. గత పంచాయతీ ఎన్నికల్లో కూడా 10 వార్డులకు ఎనిమిదింట్లో గెలిసి సత్తా చాటుకుంది. ఉప ఎన్నికలో గెలుపుతో మరోసారి తన హవా కొనసాగించింది. వార్డు సభ్యుడిగా ఎన్నికైన అప్పారావు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. గ్రామంలో పాన్‌షాపు నడుపుకొంటూ ప్రజల్లో మృదు స్వభావిగా పేరుంది. గ్రామంలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

జగనన్న సైనికులకు బీమాతో భరోసా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- జేసీఎస్ ఇన్‌చార్జులు, కన్వీనర్లు, గృహసారథుల బీమాకు శ్రీకారం



కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

సబ్బవరం: జగనన్న సైనికుల భవిష్యత్‌కు బీమాతో భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. దీనిలో భాగంగా జేసీఎస్ ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా సౌకర్యం కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ మేరకు సబ్బవరంలోని జీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి జేసీఎస్ బీమా నమోదు శిబిరాన్ని ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, జేసీఎస్ జోనల్ ఇన్‌చార్జ్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మండలాల వారీగా జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో విస్తృతంగా బీమా నమోదు కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. విపక్షాల తప్పుడు ఆరోపణలు, ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, జేసీఎస్ సబ్బవరం మండల ఇన్‌చార్జి సబ్బవరపు ముత్యాలనాయుడు, పెందుర్తి ఇన్‌చార్జ్ నక్కా కనకరాజు, పరవాడ ఇన్‌చార్జ్ వెన్నల సన్యాసిరావు, జీవీఎంసీ జోన్-1 ఇన్‌చార్జ్ ఎం.జోబ్‌దాస్, జోన్-2 ఇన్‌చార్జ్ ఇల్ల ప్రసాద్, పెందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, పార్టీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే పంచగ్రామాల భూసమస్యకు ఆజ్యం



ధర్నా చేస్తున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు, కార్పొరేటర్ గంగారావు, తదితరులు

- 1996-97లో జారీ చేసిన రైత్వారీ పట్టాలు రద్దు చేయాలి
- సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేపగుంటలో ధర్నా

సింహాచలం: త్వరగా పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వేపగుంట కూడలి వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ 1996 వరకు లేని భూసమస్య అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రారంభమైందన్నారు. ఆ రోజు నుంచి కష్టాలు మొదలయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 22(ఏ) నుంచి తొలగించి సర్వీసు ఇనాం భూములను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. అదే విధంగా 22(సీ) నుంచి జిరాయితీ భూములను కూడా తొలగిస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే హైకోర్టు యథాస్థితిని కొనసాగించాలని తాత్కాలిక ఆర్డర్ జారీ చేసిందని, దాని ప్రకారం ఇళ్ల మరమ్మతులకు, స్థలాల క్రయ విక్రయాలకు, నిర్మాణాలకు అనుమతించాలన్నారు. 1996-97లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దేవస్థానానికి ఇచ్చిన రైత్వారీ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1903 సర్వే సెటిల్‌మెంట్ రికార్డు(గిల్‌మెన్ రికార్డు) ఆధారంగా భూహక్కుదారుల్ని గుర్తించాలని కోరారు. 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ సుమారు 26 ఏళ్లుగా భూసమస్యతో పంచగ్రామాల ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. భూసమస్యని పరిష్కరిస్తామని హామీలు కురిపిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ ఆ తర్వాత సమస్యని తీర్చకుండా మిన్నకుండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.రమణి, సిహెచ్.ఎస్.గోపాలకృష్ణ, ప్రతాప్, అరుణ్‌కుమార్, కె.ఆర్.కె.ప్రసాద్, కోటేశ్వరరావు, ఎస్.రాజు, రమణ, నారాయణరావు, కృష్ణారావు, శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అప్పారావు (ఫైల్)

పరవాడ: లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో పెదముషిడివాడ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో లంకెలపాలెం గ్రామానికి చెందిన సేనాపతి అప్పారావు(52) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో సేనాపతి అప్పారావు రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అప్పారావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు చింతలగ్రహారానికి చెందిన గ్రేట్ థాట్స్ ఆధ్వర్యంలో వేపగుంట ముత్యమాంబ ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పటల్ వైద్యులు సుమారు 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేట్ థాట్స్ ఆర్గనైజర్ లీలాధర్, పువ్వాడ త్రినాథ్ పాల్గొన్నారు.

సింహాచలేశుడికి శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అధిష్ఠింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శభాష్ పోలీస్



లంకెలపాలెం కూడలిలో గోతులు పూడ్చుతున్న పరవాడ పోలీసులు

పరవాడ: గాజువాక-అనకాపల్లి జాతీయ రహదారిలో లంకెలపాలెం కూడలిలో అధ్వానంగా మారిన రహదారి బాగు కోసం పరవాడ పోలీసులు నడుం బిగించారు. కూడలిలో ఏర్పడిన భారీ గుంతల కారణంగా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించిన పరవాడ ఏఎస్‌ఐ సత్యనారాయణ కొంత మంది మిల్లర్లతో చర్చించి రహదారిలో గోతులు పూడ్చడానికి సిమెంటు కలిపిన పిక్కను సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో శనివారం వచ్చిన సిమెంట్ మిక్చర్‌తో పలురువు సిబ్బందితో కలిసి గోతులను పూడ్చారు. ఈ మేరకు పరవాడ ఏఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ శివ, హోంగార్డు శ్రీనును ప్రయాణికులు అభినందించారు.

స్టీల్‌హౌస్‌లో ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్



ప్రథమ బహుమతి సాధించిన రమేష్‌కు అవార్డు అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి



ప్రథమ బహుమతికి ఎంపికైన అరకు లైఫ్‌స్టైల్ ఫొటో

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఫొటో ఎగ్జిబిషన్ ఆదివారం ముగిసింది. వరల్డ్ ఫొటోగ్రాఫిక్ డే సందర్భంగా స్టీల్‌ప్లాంట్, వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ సంయుక్తంగా ఉక్కుహౌస్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు చక్కని స్పందన లభించింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి మాట్లాడుతూ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్రాలు సృజనాత్మకత ఉట్టిపడేలా ఉన్నాయన్నారు. తన కాలేజీ రోజుల్లో యషికా కెమెరాతో ఫొటోలు తీసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వాల్తేరు సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల అరకులో నిర్వహించిన ఫొటో వర్క్‌షాప్‌లో ప్రతిభ కనపరిచిన వి డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, బి.ఎన్.ఎస్.ఎస్. ప్రసాద్, కె.ధర్మరాజు, వి.వి. రామరాజు తీసిన ఫొటోలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన వివిధ రకాల కెమెరాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీసీ విభాగం జీఎం ఆర్.పి.శర్మ, ఫొటోగ్రాఫిక్ సొసైటీ ప్రతినిధులు పి.ఎస్.సేథ్, శ్రీనివాసరెడ్డి, జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ కీలకం

ఏయూ క్యాంపస్: సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ ఎంతో కీలకమని ఏఐటీయూసీ(ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) జాతీయ ఉపాధ్యక్షుడు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వర్కర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డి.ఆదినారాయణ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ట్రేడ్ యూనియన్- ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. మానవ వనరుల మేనేజర్‌గా విధి నిర్వహణలో ఎదుర్కొనే వివిధ సవాళ్లు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేయడం, యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య సహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆదినారాయణను విభాగాధిపతి ఆచార్య జాలాది రవి సత్కరించారు. డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ వై.ఆర్.రెడ్డి, ఎంబీఏ, హెచ్‌ఆర్‌ఎం విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ విస్తృత సేవలు



నిత్యావసర సరకులు అందిస్తున్న డాక్టర్ గోపాలరావు, గొర్లె రామునాయుడు, తదితరులు

సింహాచలం: లయన్స్ క్లబ్ పెందుర్తి శాఖని ఆదివారం డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు సందర్శించారు. క్లబ్ పెందుర్తి అధ్యక్షుడు గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో జరిగిన డే లాగ్ కార్యక్రమంలో పాల్గొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పెందుర్తిలోని లయోలా ఓల్డేజ్ హోమ్, దివ్యాంగుల ట్రస్టుకు నిత్యావసర సరకులు, ఫలాలు, బిస్కెట్లు, రొట్టెలు అందజేశారు. అనంతరం క్లబ్ కొత్త మెంబర్లను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రీజినల్ చైర్మన్ పి.సత్యానందం, జోనల్ చైర్‌పర్సన్ సుధారాణి, పెందుర్తి సెక్రటరీ ఆర్.వాసు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీకి ఆద్యుడు రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గాజువాక: ఆధునిక టెక్నాలజీ అభివృద్ధికి మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ చేసిన కృషి అజరామరమని కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పాత గాజువాకలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారతదేశాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణ, యరబాల భూలోక, ఉరుకూటి బాబూరావు, లక్కరాజు రామారావు, గుడివాడ శ్రీనివాసరావు, స్వర్ణ, మురళి, అలీ, రమణారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నడుపూరులోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెర్రిపోతుల ముత్యాలు తదితరులు నివాళులర్పించారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో రద్దు

మహారాణిపేట: సోమవారం జరిగే డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే ఈ కార్యక్రమం ఈ వారం నిర్వహించడం లేదన్నారు. అందువల్ల ఫిర్యాదుదారులు ఎవరు ఫోన్ చేయవద్దని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

లంకా మైదానంలో 'అనంత పంచముఖ గణేశుడు'

- భారీ గణపతి నమూనా విగ్రహం ఆవిష్కరణ



నమూనా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణి

గాజువాక : పాత గాజువాక లంకా మైదానంలో రూపు దిద్దుకొంటున్న భారీ గణపతి విగ్రహ నమూనాను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆదివారం ఆవిష్కరించారు. వచ్చేనెల 18 నుంచి ఇక్కడ నిర్వహించనున్న ఉత్సవాలకు రూపొందుతున్న విగ్రహానికి అనంత పంచముఖ గణేశునిగా నామకరణం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, సురేష్, ఇమ్రాన్, నిర్వాహకుడు గణేష్, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, యువశ్రీ, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు దిగిన ఇల్లు తనదంటూ దౌర్జన్యం

పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు

సింధియా: వృద్ధాప్యంలో తోడుగా ఉంటానని మాయ మాటలు చెప్పి రెండేళ్ల కిందట అద్దెకు దిగిన ఓ యువకుడు.. ప్రస్తుతం ఆ ఇల్లు తనకే చెందుతుందని ఎదురు తిరగడంతో సదరు ఇంటి యజమాని మల్కాపురం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా.. 63వ వార్డు చింతల్లోవలో దువ్వాడ పైడిరాజు అనే వృద్ధుడు నివసిస్తున్నాడు. తన భార్య నూకమ్మ మొదటి భర్త కుమారుడు దువ్వాడ అప్పారావు కుమారుడైన నాగరాజుకు రెండేళ్ల కిందట తన ఇంటిలో కొంత భాగాన్ని అద్దెకు ఇచ్చాడు. ఆ సమయంలో హక్కుదారుడైన దువ్వాడ పైడిరాజును అన్నీ తానై చూసుకుంటానని వృద్ధుడి కుమార్తెలను నాగరాజు నమ్మబలికి ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. మూడు నెలల అద్దె మాత్రం చెల్లించి.. ఆపై పైడిరాజును పట్టించుకోవడం మానేశాడు. తనకు వచ్చే పెన్షన్ సొమ్ము, కూతుళ్లు ఇచ్చే డబ్బులతో కాలం గడుపుతున్న పైడిరాజుపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ఇంటిని ఖాళీ చేయకుండా తిష్ట వేశాడు. ఇంటికి సంబంధించిన హక్కు పత్రాలు తన వద్దే ఉన్నాయని, నాగరాజు చేత ఇల్లు ఖాళీ చేయించి ఇవ్వాలని కోరుతూ మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో వృద్ధుడు పైడిరాజు ఆదివారం ఫిర్యాదు చేశాడు. కొంతమంది అండదండలతో నాగరాజు బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు పైడిరాజు తన ఇంటి ముందు దీక్షకు దిగాడు.

రామకృష్ణ గీతాలు చిరస్మరణీయం

బీచ్ రోడ్డు: రామకృష్ణ గీతాలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ 76వ జయంతి కార్యక్రమం ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని ఘంటసాల ప్రాంగణంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విజయనగరంలో పుట్టిన రామకృష్ణ.. నేదునూరి కృష్ణమూర్తి వద్ద శాస్త్రీయ సంగీత మెలకువలు నేర్చుకుని ఎన్నో కచేరీలు ఇచ్చారన్నారు. విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డా. జాలాది విజయ మాట్లాడుతూ 200 చిత్రాలకు ఐదు వేలకు పైగా పాటలు పాడిన అపర ఘంటసాల వి.రామకృష్ణ అని కొనియాడారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ఆకాశవాణి గాయకుడిగా రంగ ప్రవేశం చేసిన రామకృష్ణ అన్ని వర్గాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ డీవో బొమ్మిడి సత్యనారాయణ, వి.రామకృష్ణ మెమోరియల్స్ అధ్యక్షుడు, గాయకుడు జి.రామకృష్ణ, సకల కళాకారుల సంఘం కార్యదర్శి, లెఫ్టినెంట్ లోకేశ్వరరావు, రచయిత పి.శ్యాం సుందర్, జి.త్యాగరాజు, లాయర్ శ్రీదేవి, డీబీ వెంకటాద్రి, వెంకటలక్ష్మి, వి.సత్యం తదితరులు పాల్గొని రామకృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.